జాడలేని రైతు చైతన్య యాత్రలు

- సమీపిస్తున్న ఖరీఫ్ సాగు
- రైతులకు అందని సాగు సూచనలు, సలహాలు



షాబాద్: వ్యవసాయంలో రైతులకు సూచనలు సలహాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం నిర్వహించే మన తెలంగాణ–మన వ్యవసాయం నిర్వహణపై అధికారులు ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. సాగులో అవలంబించాల్సిన మెలకువలు, పంటల బీమా, యంత్రాల రాయితీలపై అవగాహన సదస్సుల నిర్వహణ అటకెక్కింది. ప్రభుత్వం చేపట్టిన రైతుబంధు పథకాన్ని అమలు చేయడంలో అధికారులు మునిగిపోయారు. ప్రతీ ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో నిర్వహించే రైతు చైతన్య యాత్రలు ఈ ఏడాది లేనట్టేనని అధికారుల ద్వారా తెలుస్తోంది. ఖరీఫ్ సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం, పంట మార్పిడి లేకపోవడం, అధిక మోతాదు ఎరువుల వినియోగం తదితర అంశాల్లో రైతులకు అవగాహన కరువవుతోంది.

కార్యక్రమ లక్ష్యాలు...

రైతులకు అండగా నిలిచే ఉద్దేశంతో రైతు చైతన్య యాత్రలు నిర్వహించి రైతులు ఆర్థిక ప్రగతి సాధించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతారు. పంటల మార్పిడి, పంటలకు మద్దతు ధర రాకపోతే గోదాముల్లో నిల్వ చేసుకుని రుణం పొందడం, పంట రుణాలు పొందడం, పంటల బీమా, వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేయాల్సిన పంటల రకాలు, పంటలకు ఆశించే చీడపీడలను నాశనం చేయడం, పెట్టుబడి తగ్గించుకోవడం, ఆశించిన దిగుబడి పొందడం, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా రైతులకు అందించే సేవలు, ఆర్థిక ప్రగతి కోసం ఆయాశాఖల కృషి, రైతుకు అందించే ప్రోత్సాహం తదితర అంశాలపై రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పిస్తారు. కానీ, ఈ ఏడాది రైతుబంధు కార్యక్రమం వల్ల రైతు చైతన్య యాత్రలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. రైతులు అవలంబించాల్సిన విధానాలు, సాగు పద్ధతులపై సలహాలు అందడంలేదని పలువురు అభిప్రాయపడ్డారు.

అవగాహనతో ప్రయోజనం..



చైతన్య యాత్రల ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అవగాహన లోపంతో మోతాదుకు మించి ఎరువులు వినియోగించి సకాలంలో వర్షాలు కురవక ఆశించిన దిగుబడి రాక రైతులు ఏటా నష్టపోతున్నారు. ఆయా సమస్యలను అధిగమించిన ఆర్థిక నష్టాల నుంచి రైతులను గట్టెక్కించడానికి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయి.

– మహేందర్‌రెడ్డి, రైతు పోలారం

ఆదేశాలు అందలేదు..



రైతు చైతన్య యాత్రలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు సమగ్ర రైతు సమాచార సేకరణ, ఆన్‌లైన్ నమోదు, రైతుబంధు, కిసాన్ సమ్మాన్‌నిధి తదితర పథకాలను రైతులకు చేర్చడంలో ఉన్నారు. సాధ్యమైన మేర ఏఈఓల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. చైతన్య యాత్రల నిర్వహణపై ఆదేశాలు అందించే నిర్వహిస్తాం.

– వెంకటేశం, ఏఓ షాబాద్

డయాగ్నొస్టిక్ సెంటర్‌కు నోటీసులు



నిర్వాహకులకు నోటీసు ఇస్తున్న డాక్టర్ అమ్రిత జోసెఫ్

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రంలోని శుభం డయాగ్నొస్టిక్ సెంటర్‌కు బుధవారం మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం చౌదరిగూడలోని ఎక్బాల్ క్లినిక్‌లో ఓ మహిళకు డాక్టర్ ఎక్బాల్ ఆమెకు ప్రథమ చికిత్స చేసి, అనంతరం మధుమేహవ్యాధి పరీక్షల కోసం డయాగ్నొస్టిక్ సెంటర్‌కు పంపించారు. అయితే డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్వాహకులు ఆమెకు షుగర్ లెవల్స్ పెరిగిపోయాయని తప్పుడు నివేదిక ఇచ్చారు. దీంతో కంగారు పడిన మహిళ షాద్‌నగర్‌లోని మరో డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోగా సాధారణ స్థాయిలో ఉన్నట్లు రిపోర్ట్ ఇచ్చారు. దీంతో ఆమె కుదుటపడి తనకు తప్పుడు నివేదిక ఇచ్చిన సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. దీంతో శుభం డయాగ్నొస్టిక్ సెంటర్, ఎక్బాల్ క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. వెంటనే తమకు వివరణ ఇవ్వాలని సెంటర్ నిర్వాహకుడు శ్రీకాంత్‌ను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ట్రాఫిక్ సీఐ శ్రీశైలం యాదవ్



బోలార్డ్స్‌ను పరిశీలిస్తున్న సీఐ శ్రీశైలం యాదవ్

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. ప్రమాదాల నివారణకు పట్టణంతో పాటుగా, వివిధ మండలాల పరిధిలోని రోడ్లపై బోలార్డ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పట్టణంతో పాటుగా, వివిధ గ్రామాల్లో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు బారికేట్లు, బోలార్డ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల పరిధిలో మూల మలుపుల వద్ద ఏపుగా చెట్ల పెరగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మలుపుల వద్ద చెట్లను తొలగించడంతో పాటుగా గుంతలను పూడ్చే విధంగా ఆయా గ్రామాల సర్పంచులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అందరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని వివరించారు.

క్లుప్తంగా

విద్యార్థికి ఘన సన్మానం



విద్యార్థిని సన్మానించిన కళాశాల అధ్యాపకులు

షాద్‌నగర్: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వపు విద్యార్థి రమావత్ రమేశ్ రైల్వేశాఖలో ట్రెనింగ్ పాయింట్స్ మెన్ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థి రమేశ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కృషి, పట్టుదలతో దేనినైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. అనంతరం రమావత్ రమేశ్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఉత్తర ఫాల్గుణి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

కొందుర్గు: మండల కేంద్రంలోని గాడిబావి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం యంత్ర ప్రతిష్ఠాపన, హనుమాన్ విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ యాదమ్మ

కొందుర్గు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీపీ యాదమ్మ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కేంద్రానికి తెచ్చి ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరను పొందాలని సూచించారు. ధాన్యాన్ని పూర్తిగా ఎండబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సీఈఓ మహమూద్ షరీఫ్, డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలి

తైక్వాండో మాస్టర్‌కు సూచించిన హోంమంత్రి



మనోహర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: తైక్వాండో శిక్షకుడిగా ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలని తైక్వాండో మాస్టర్ మనోహర్‌కు హోం మంత్రి మహమూద్ అలీ సూచించారు. మంగళవారం రాత్రి స్థానిక సమద్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై.. తైక్వాండో కొరియా 5వ డాన్ సర్టిఫికెట్ సాధించిన మనోహర్‌ను అభినందించి, ధ్రువపత్రం అందజేశారు. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి క్రీడాకారునికి అభినందనలు తెలిపారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ తాండూరు నుంచి ఇంటర్నేషనల్ తైక్వాండో క్రీడాపోటీలకు ప్రాతినిధ్యం వహించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతానని తెలిపారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

నవాబుపేట: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వికలాంగుల పింఛన్లు మంజూరు చేయాలని, అంత్యోదయ కార్డుతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వికలాంగుల నాయకులు వెంకటేశం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబలితో ఆరోగ్యానికి ఎంతో మేలు

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



అంబలిని అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అంబలి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమృతపానం అంబలి కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా 167 అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాగి, అరికెలు, సామలు, కొర్రలు, అండు కొర్రలు, జొన్నలతో కూడిన మిశ్రమాన్ని అంబలిగా తయారు చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పౌష్టిక పదార్థాలతో కూడిన ఈ అంబలిని సేవిస్తే శరీరానికి ఎంతో బలాన్ని ఇస్తుందన్నారు. ప్రతి రోజు ఐదు వేల లీటర్ల అంబలిని తయారు చేసి 50వేల మందికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జూన్ 5వ తేదీ వరకు ఈ కేంద్రాలు కొనసాగిస్తామని తెలిపారు. నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యంగా ట్రస్టు ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను దేశం నుంచి తరిమికొట్టాలి



కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బజరంగ్ దళ్ నాయకులు

బజరంగ్ దళ్ విభాగ్ కో–కన్వీనర్ రమేష్

షాబాద్: కాంగ్రెస్ పార్టీని ఈ దేశం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని బజరంగ్ దళ్ విభాగ్ కో–కన్వీనర్ గూడెం రమేశ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కుటుంబ వ్యవస్థ కోసం నిత్యం పాటుపడుతూ ఒక్కోరోజు కొన్ని లక్షల గోవులను కాపాడుతూ.. ప్రతి సంవత్సరం ఐదు లక్షలకు పైగా బజరంగ్ దళ్ కార్యకర్తలు రక్తదానాలు చేస్తున్నారన్నారు. కొన్ని వందల దేవాలయ భూములను అన్యాక్రాంతం కాకుండా ఆపగలుతున్నామని ఆరోపించారు. కార్యక్రమంలో వినయ్, సాయిరాం, మహేందర్, నాఖిల్, వంశీ, రాజశేఖర్, లింగం తదితరులున్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయండి



సమ్మెకు సంఘీభావం తెలిపిన బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర నేత శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వారికి బీజేపీ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జూనియర్, ఔవుట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు బాబయ్య, వెంకటేశ్, అశోక్, రుషికేశ్, నర్సింహ్మ, శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు యాదయ్య, స్వప్న, రవీందర్, శ్రీనివాస్, వెంకటేశ్, రాధాకృష్ణ, ధీరజ్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: మత్స్యకారుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మత్స్యకారుల నూతన ప్రొసీడింగ్‌ను సొసైటీ సభ్యులకు బుధవారం అందజేసి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుందని, చాలా గ్రామాల్లో సొసైటీలు లేని వారికి నూతన సొసైటీలను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. అంతే కాకుండా మత్స్యశాఖ ద్వారా చేపలు పట్టే సామగ్రి, వాహనాలను ఉచితంగా అందజేసిందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను బెస్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సిద్దయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

పాలేపల్లి గ్రామానికి చెందిన కండెవోని లక్ష్మికి రూ.2లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది రోగులకు మెరుగైన చికిత్స కోసం సాయం అందుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, పరిగి ఎంపీపీ అరవింద్‌రావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

యమపాశాలుగా విద్యుత్ తీగలు

పట్టించుకోని అధికారులు



నాగర్‌గూడలో చేతికి అందే ఎత్తులో ఉన్న కరెంట్ తీగలు



తిమ్మారెడ్డిగూడలో స్కూల్‌పై నుంచి వెళ్తున్న వైర్లు

షాబాద్: పంట పొలాల్లో విద్యుత్ వైర్లు యమపాశాలుగా వేలాడుతున్నాయి. ఏ మాత్రం ఆజాగ్రత్తగా ఉన్న రైతుల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. లూప్‌వైర్ల కారణంగా జిల్లాలో తరుచు ప్రమాదాలు జరిగి అమాయకులైన రైతుల ప్రాణాలు కోల్పోతున్నా విద్యుత్ అధికారుల్లో చలనం లేదు. పచ్చని పంట పొలాల్లో యమపాశాలుగా చేతికి అందే స్థితిలో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారే తప్ప విద్యుత్ తీగలను సరి చేయడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. లూప్‌లైన్ల విద్యుత్ వైర్ల కారణంగా తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగరగూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, మక్తాగూడ, తిర్మలాపూర్, పోలారం, బొబ్బిలిగామ తదితర గ్రామాల్లో విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చాలా గ్రామాల్లో చేతికందే విధంగా వైర్లు ఉండడంతో రైతులు పంటపొలాల్లోకి వెళ్లేందుకు జంకుతున్నారు. రాత్రి సమయంలో నీరు పెట్టేందుకు వెళ్లాలంటే భయం భయంగా వెళ్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌గూడలో పొలంలో నేలకు తాకేలా వైర్లు వేలాడుతుండడంతో కర్రల సహాయంతో వ్యవసాయం సాగిస్తున్నారు. డీడీలు కట్టి బిల్లులు చెల్లిస్తున్నా అధికారులు లూప్‌లైన్లను సరిచేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. లూప్‌లైన్ల కారణంగా పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయని, గాలి వానలకు వైర్లు తగిలి మంటలు వస్తున్నాయని చెబుతున్నారు. వెంటనే లూప్‌లైన్లను సరిచేసి ప్రమాదాలను అరికట్టాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చౌరస్తా విస్తరణకు సహకరించండి

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

నందిగామ: మండల కేంద్రం నందిగామలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట, నర్సప్పగూడ రోడ్డు చౌరస్తాను వెడల్పు చేసేందుకు సహకరించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ జిలెల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నర్సప్పగూడ వైపు నుంచి వచ్చే వాహనాలు పాత జాతీయ రహదారిపైకి షాద్‌నగర్ వైపునకు వెళ్లాలంటే చౌరస్తా ఇరుకుగా ఉండడంతో వాహనాలు కనపడడం లేదని, దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. స్థానికులు, ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరిస్తే ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆశీస్సులతో చౌరస్తాను వెడల్పు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అంతేకాకుండా ఆ రోడ్డులో పరిశ్రమలు ఉన్నందున భారీ వాహనాలు, ట్రక్కులు రాకపోకలు కొనసాగిస్తుంటాయని, దీంతో చౌరస్తా వద్ద వాహనాలు మళ్లించేందుకు డ్రైవర్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు సహకరిస్తే చౌరస్తాను వెడల్పు చేస్తానని చెప్పారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

తాండూరు టౌన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంలో సమ్మర్ క్యాంపులో దోహదపడతాయని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్ అన్నారు. బుధవారం పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ఏడాది పాటు చదువుతో కుస్తీ పట్టే విద్యార్థులు.. పుస్తకాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారిలో దాగున్న నైపుణ్యాన్ని వెలికి తీయాలంటే సమ్మర్ క్యాంపులు అవసరమన్నారు. ఈ క్యాంపులో అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. నెల రోజుల పాటు గణితం, కాలిగ్రఫీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, పెయింటింగ్, కోడింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్‌తో పాటు పలు విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రికి బైరాగిగూడవాసుల వినతి

కందుకూరు: మండల పరిధిలోని బైరాగిగూడకు చెందిన వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ సమీర్, మైనార్టీ బ్లాక్ ప్రెసిడెంట్ దావూద్, నాయకులు కుమార్, సర్వర్, వార్డు సభ్యులు నరేందర్, పరమేశ్వరి, భగవంత్, మైసయ్య, రాము, శివప్రసాద్‌గౌడ్, పాల్గొన్నారు.

సీపీఐ సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల: బీజేపీకో హఠావో దేశ్‌కో బచావో అనే నినాదంతో చేపట్టిన ఇంటింటికి సీపీఐ కార్యక్రమం ముగింపు సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. చేవెళ్లలో బుధవారం నియోజకవర్గ కన్వీనర్ రామస్వామి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీన చేవెళ్లలో సీపీఐ నియోజకవర్గస్థాయిలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గత నెల 16వ తేదీ నుంచి నవాబుపేట, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, చేవెళ్ల మండలాల్లోని 155 గ్రామాల్లో సీపీఐ ఇంటింటికీ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ముగింపు సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, జిల్లానాయకులు, పాల్గొంటారని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ప్రభులింగం, సత్యనారాయణ, అంజయ్య పాల్గొన్నారు.

బస్సులు రాకుండా అడ్డుగా గుంతలు



డీఎం సమతతో మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు

దారికి అడ్డంగా మొక్కలు నాటే వారిపై చర్యలు తీసుకోవాలి: డీఎం

ధారూరు: బస్టాండ్‌లోకి బస్సులకు వెళ్లకుండా అడ్డంగా మొక్కలు నాటే యత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తాండూర్ డిపో మేనేజర్ సమత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణ ప్రాంగణంలోకి సర్వీసులు రాకుండా అడ్డుగా మొక్కలు నాటేందుకు కొందరు గుంతలు తీశారని, వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పోలీసుల సహాయంతో తవ్విన గుంతలను పూడ్చివేయించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘానికి చెందిన పలువురు డీఎంతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట తగిన స్థలం లేదని, ఏమైనా కార్యక్రమాలు చేపట్టాలంటే దుమ్ముధూళితో ఇబ్బంది కలుగుతుందని, బస్సులు వెళ్లేదారిని కొద్దిగా ముందుకు జరపాలని డీఎంకు విన్నవించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న గుంత

నందిగామ: మండలంలోని అంతిరెడ్డిగూడ గ్రామానికి ఆనుకొని ఇటీవల వెలసిన ఓ వెంచర్‌లో ఓ గుంత ప్రమాదకరంగా ఉంది. ఆ గుంత నిండా నీరు ఉంది. గ్రామానికి అతి సమీపంలో ఉన్న ఈ వెంచర్‌లో సైతం పిల్లలు ఆడుకుంటున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, చూడకుండా నీటి గుంతలోకి దిగినా ప్రాణాలు గోవిందా.. గతంలో మండలంలో సరదాగా ఈతకు దిగి ఎంతో మంది చిన్నారుల ప్రాణాలు గాల్లో కలిసిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత వెంచర్ నిర్వాహకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.